రైతులను ఆగం చేస్తే ఊరుకోం

- సీఎం ఆదేశించినా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజూరాబాద్, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తే చూస్తూ ఊరుకోమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, పుష్కలంగా పంటలు పండిస్తూ సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎప్పుడూ రైతుల పక్షపాతిగా ఆలోచించే వారని, అందుకే ఆయన పాలనలో వ్యవసాయం పండుగలా సాగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినా కూడా అధికారులు తడిసిన ధాన్యం కొనడంలో జాప్యం చేస్తుండడంతో రైతులు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి ప్రస్తుతం సన్నవడ్లకు మాత్రమే దానిని పరిమితం చేయడమేమిటని ప్రశ్నించారు. దొడ్డు వడ్లకు సైతం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల కరెంటుతో ఇవ్వడంతో పాటు రైతుబంధు, రుణమాఫీ కచ్చితంగా అమలు చేయాలన్నారు. రైతులు పండించిన పంటను మొత్తాన్ని ప్రభుత్వం కొనాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణీ సురేందర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఐలయ్య, కౌన్సిలర్లు రమ, లావణ్య, రమేశ్, నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్ సదానందం, భాస్కర్, మధు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ చెల్లించాలి

- బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- మానకొండూర్ మండల కేంద్రంలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం

గంగాధర వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మానకొండూర్/ గంగాధర, మే 21: దొడ్డు వడ్లకు బోనస్ చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం జిల్లాలో రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మానకొండూర్ మండల కేంద్రంలో ఏఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్ నాయకులతో కలిసి పరిశీలించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతాంగ సమస్యలను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మార్కెట్ కమిటీ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లను కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. అకాల వర్షంతో రైతులకు అపార నష్టం వాటిల్లితే ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే దొడ్ల వడ్లకు, సన్న రకానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు ఆడప శ్రీనివాస్, నాయకులు శాతరాజు యాదగిరి, పిట్టల మధు, రామంచ గోపాల్‌రెడ్డి, కొత్తకొండ నాగరాజు, బోడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర వ్యవసాయ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు నిరసన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే ఇస్తామంటూ రైతులను దగా చేసిందని దుయ్యబట్టారు. దొడ్డు వడ్లకు బోనస్ చెల్లించే వరకూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ద్యావ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచులు వేముల దామోదర్, రామిడి సురేందర్, యండీ నజీర్, వడ్లూరి ఆదిమల్లు, నాయకులు దోమకొండ మల్లయ్య, గంగాధర కుమార్, ఈర్ల మహిపాల్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, మే 21: కేవలం సన్నవడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ రైతులను ఘరానా మోసం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. ఎన్నికల ముందు మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రుల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు నెలకు రూ.నాలుగు వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి మాట మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు బోనస్ విషయంలో రైతులను దారుణంగా మోసం చేసిందని దుయ్యబట్టారు. అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసం లోక్‌సభ ఎన్నికలు ముగియగానే బట్టబయలైందని విమర్శించారు. రాష్ట్రంలో 90శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారని, వారందరికీ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో నగర నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్

కార్పొరేషన్, మే 21: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా కరీంనగర్‌కు చెందిన ఆ పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని రెండు రోజులుగా నియోజకవర్గంలో ఓటర్లను కలుస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

వీణవంక ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

వీణవంక, మే 21: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి వీఎస్ జనార్దన్ రావు ఆదేశించారు. మండలంలోని ఎంపీపీఎస్ ఇప్పలపల్లి, గొల్లపల్లి, వీణవంక, జడ్పీహెచ్ఎస్ మామిడాలపల్లి అమ్మ ఆదర్శ పాఠశాలల్లోని పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల మరమ్మతులు, నీటి వసతి కల్పించడం, తదితర పనులను అడిగి తెలుసుకొని, అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు అశోక్‌రెడ్డి, సంపత్‌కుమారాచారి, శ్రీనివాస్, ఉపాధ్యాయుడు నాగిరెడ్డి, ఏఈ రమేశ్, వీవో సునీత, సీఆర్పీలు శ్రీనివాస్, సంపత్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలకు గ్రామాలే పట్టుగొమ్మలు

ఎలుబాకలో చిరుతల రామాయణ ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

వీణవంక, మే 21: తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతీ సంప్రదాయాలకు, ప్రాచీన కళలకు గ్రామాలే పట్టుగొమ్మలుగా నిలుస్తున్నాయని సొసైటీ చైర్మన్ మావురపు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎలుబాక గ్రామంలో చిరుతల రామాయణ ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ వన మాల-సాధవరెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, రామాయణం, మహాభారత ఇతిహాసాలను చదవడం, వినడం కంటే కళ్లకు కట్టినట్లు చూపే కళ ప్రదర్శనల ద్వారా వాటిపై భవిష్యత్ తరాలకు ఆసక్తి, అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. చిరుతల రామాయణ ప్రదర్శన ఇస్తున్న కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాపం వీరారెడ్డి, మాజీ సర్పంచులు ఓదెలు, కాంతారెడ్డి, నాయకులు రాజారాంగౌడ్, వీరస్వామిగౌడ్, కళాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిల్లాల విభజనపై రౌండ్‌టేబుల్ సమావేశం

తెలంగాణచౌక్, మే 21: జిల్లాల విభజనపై మేధావులు రాజకీయ పార్టీలతో కలిసి త్వరలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ పేర్కొన్నారు. ప్రెస్ భవనంలో మంగళవారం ఫ్రంట్ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 33 జిల్లాల ఏర్పాటుపై కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ప్రతి పార్లమెంట్ పరిధిని జిల్లా ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. జిల్లా విభజనపై పార్టీలకతీతంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడాలన్నారు. ఈ సమావేశంలో ఫ్రంట్ సభ్యులు రవీందర్, బాపురెడ్డి, చంద్రశేఖర్, రామ్మూర్తి, శ్రీధర్ పాల్గొన్నారు.

24న ఆయిల్ పామ్ సాగుపై రైతులకు శిక్షణ

హుజూరాబాద్ రూరల్, మే 21: ఈ నెల 24న జమ్మికుంటలోని కేవీకేలో ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆయిల్ పామ్ కంపెనీల సలహాదారు రంగనాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయిల్ పామ్ సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు, ఎరువులు, నీటి యాజమాన్యం తదితర అంశాలపై సమగ్రంగా వివరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, లోహియా కంపెనీ సీఈవో, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అప్పులబాధతో రియల్ ఎస్టేల్ వ్యాపారి ఆత్మహత్య

చొప్పదండి, మే 21 : భూపాలపట్నం గ్రామానికి చెందిన బైరగోని ఆనంద్ గౌడ్(47) అప్పుల బాధ భరించలేక సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉపేంద్రాచారి తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్ గౌడ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సరిగా నడవక నష్టం రావడం, అప్పులు ఎక్కువ కావడంపై అతడు రోజూ బాధపడుతూ ఉండేవాడు. సోమవారం రాత్రి బాల్కనీలో స్లాబ్‌కు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి ఒంటిగంట సమయంలో నిద్రలేచిన అతడి భార్య రమ, ఉరేసుకున్న భర్తను చూసి కేకలు వేయగా, చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రధాన దవాఖానకు తరలించారు. రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 21: నగరంలో విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాంధీ రోడ్డు, హుస్సేనీపుర, శర్మ నగర్, అశోక్ నగర్, సీతారాంపూర్‌లో కొంత ప్రాంతం, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1 ఏడీఈ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆదాయపు పన్ను ఫైలింగ్‌పై అవగాహన

ముకరంపుర, మే 21: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ ఫైలింగ్‌పై ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ డాక్టర్ ఎన్ రాజుకుమార్, అడిషనల్ కమిషనర్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ సర్కిల్ హెచ్ లన్ అవగాహన కల్పించారు. ఫైలింగ్, ఫామ్ 16 అప్డేట్, రిటర్న్స్, ప్రాసెసింగ్ లెటర్, ఇంటిమేషన్, నోటీసులు తదితర అంశాలను వివరించారు. డీఈలు విజయేందర్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, రాజం, తిరుపతి, గోపీకృష్ణ, కాళిదాసు, చంద్రమౌళి, శ్రీకాంత్, రాజేశం, ఏవోలు, ఏఏవోలు, ఏడీలు, పీవో, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

బోనస్‌పై మాట మార్చడం సరికాదు

చొప్పదండి, మే 21: ఎన్నికల ప్రచారంలో రైతులకు ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి నేడు మాట మార్చడం సరికాదని బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జి బందారపు అజయ్‌కుమార్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రుణమాఫీని అమలు చేయాలి

గంగాధర, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీని అమలు చేయడంతో పాటు, సన్నవడ్లు, దొడ్డు వడ్లు అన్న తేడా లేకుండా రూ.500 బోనస్ చెల్లించాలని బీజేపీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మధురానగర్‌లో ఉన్న బీజేపీ కారాల్యయంలో రైతన్న కోసం బీజేపీ రణభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోల అశోక్, ఎడవెల్లి శశిధర్‌రెడ్డి, తూము నారాయణ, మల్యాల వినయ్‌సాగర్, సుద్దాల రవీందర్‌రెడ్డి, రేండ్ల శ్రీనివాస్, ఆళ్ల విజేందర్‌రెడ్డి, ఆకుల మనోహర్, వొడ్నాల రాజు, తాళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ప్రకటన

Paramitha Heritage High school Padmanagar, Karimnagar తేది: 25-05-2024 నుండి 03-06-2024 వరకు NCC క్యాంపులో Grocery: బియ్యం, పప్పు, మసాలా దినుసులు,\కూరగాయలు సప్లై చేయుటకై టెండర్లు కోరడమైనది, ఆసక్తి గలవారు తమ కొటేషన్‌ను CO 9 (T) మెయిలియస్ నేటి 21-05-2024 వరకు ఇవ్వవలసినదిగా కోరడమైనది. చిరునామా: **NCC Office**, Near, D-Mart Road, Karimnagar **Cell: 8506097665**

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ శ్రీపతి నాగరాజు, S/o పర్షరాములు, R/o. గన్నేరువరం గ్రామం మరియు మండలం, కరీంనగర్ జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన గూన ఇల్లు H.No. 1-42 లోని కొంత భాగం మరియు దీని యొక్క ఖాళీస్థలం మొత్తం విస్తీర్ణం 488.00 చ.గజాలు, గన్నేరువరం గ్రామం మరియు మండలం, కరీంనగర్ జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనభాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 5 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 21-05-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధార్థనగర్, సిరిసిల్ల, జి॥ రాజన్న సిరిసిల్ల.

క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలి

కేడీసీఏ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు • ముగిసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు

జ్ఞాపికలు అందుకున్న క్రీడాకారులతో మురళీధర్‌రావు తదితరులు

కొత్తపల్లి, మే 21 : జిల్లా క్రీడాకారులు క్రికెట్ శిక్షణ శిబిరాల్లో నేర్చుకున్న మెళకువలతో మున్ముందు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు ఆకాంక్షించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా కేడీసీఏ ప్రధాన మైదానంలో నిర్వహించిన శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన, క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించిన కోచ్‌లకు జ్ఞాపికలు ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడాకారులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలువాలన్నారు. భవిష్యత్తులో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రికెట్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు త్వరలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను సంవత్సరం మొత్తం కూడా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలో అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్‌లు, జిల్లా క్రికెట్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీ హబ్ టాలెంట్ ఫామ్‌తో జ్యోతిష్మతి ఒప్పందం

తిమ్మాపూర్ రూరల్, మే 21: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల, హైదరాబాద్‌లోని టీహబ్ టాలెంట్ ఫామ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కే శ్రీనివాస్ రావు టీ హబ్ టాలెంట్ ఫామ్ మత్ సీఈవో రాహుల్ పైత్ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్లోబల్ ఏఐ అకాడమిక్స్ అల్లైన్స్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్ మత్ హబ్‌తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపించారని, ఇది విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు, పరిశోధన రంగంలో అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఉన్నత ప్రమాణాలను కలిగిన కంపెనీలతో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని కళాశాల, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

రాయికల్: బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐలు

రాయికల్, మే 21: పట్టణానికి చెందిన బుడిక విజయలక్ష్మి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా, తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో భద్రపరిచిన 40 తులాల బంగారం, రూ. లక్ష నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ వేణుగోపాల్ పరిశీలించారు. బాధితురాలు విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పెగడపల్లి, మే 21: మండల కేంద్రంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ జాడి రామకృష్ణ, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న ఆరె బూదమ్మ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలో దాచిన రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందంతో విచారణ చేపట్టారు. బూదమ్మ కొడుకు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భగవతి, ఆర్విన్ ట్రీలో ముగిసిన సమ్మర్ క్యాంపు

సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులతో పాఠశాల చైర్మన్ రమణారావు

కమాన్‌చౌరస్తా, మే 21 : జిల్లా కేంద్రంలోని భగవతి, ఆర్విన్ ట్రీ పాఠశాలల్లో నెల రోజులుగా కొనసాగుతున్న సమ్మర్ డ్యాన్స్ క్యాంప్-2024 ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ బీ రమణారావు, కరస్పాండెంట్ బీ విజయలక్ష్మి ప్రారంభించారు. నెల రోజులుగా సమ్మర్ క్యాంపులో భాగంగా పాఠశాలల ఆవరణలో క్లాసికల్, వెస్ట్రన్, హిప్-హాప్, జుంబా డ్యాన్స్, వివిధ రాష్ట్రాల జానపద నృత్యాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బీ విజయలక్ష్మి, డ్యాన్స్ మాస్టర్స్ గోవింద్, గురు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ జీ దేవేందర్

తిమ్మాపూర్ రూరల్, మే 21: అలుగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కేంద్రం (సీవోఈ) విద్యార్థులు ఐఐటీ ఎంట్రెన్స్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. ఐఐటీ, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ మార్చి 2024 ఎంట్రెన్స్‌లో కే ఆశ్రిత జాతీయ స్థాయిలో 86వ ర్యాంకు, ఐఐటీ, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్‌లో బీ సన్నీ జాతీయ స్థాయిలో 94, ఎం ఆదిత్య 111వ ర్యాంకు సాధించగా, వారిని కళాశాల ప్రిన్సిపాల్ జీ దేవేందర్, అధ్యాపకులు అభినందించారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు మృతి

శంకరపట్నం, మే 21: మండలంలోని చింతలపల్లి గ్రామంలో మనస్తాపానికి గురై పురుగుల మందుతాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లికి చెందిన బొంతల హన్మంతు (70) అనే వృద్ధుడికి అతడి సోదరుడు బొంతల సమ్మయ్యతో కొంత కాలంగా భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో సమ్మయ్యతో పాటు అతడి కుటుంబ సభ్యులు హన్మంతును దూషిస్తూ చంపుతామని బెదిరించారు. దీంతో హన్మంతు ఈ నెల 18న తీవ్ర మనస్తాపానికి లోన